క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి, కనకమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోలుకట్ట ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 24 గంటల ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు, కేతిరెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. తోలుకట్ట, సజ్జన్‌పల్లి, కేతిరెడ్డిపల్లి, బ్రౌన్‌టౌన్ ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయంలో సహకరించాలని ఆయన కోరారు.

చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు

కొత్తూరు: ప్రభుత్వ భూమిలో వ్యర్థాలను పారబోస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులోని ఒక పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను ఇదే గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో పారబోస్తున్నట్లు తీగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి కొత్తూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యర్థాలను తింటున్న పశువులు అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా వ్యర్థాలనుంచి పారేనీరు పంటపొలాల్లోకి చేరి దిగుబడి తక్కువస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి తగిన విచారణ చేపట్టి వెంటనే సంబంధికులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న ఆనంద్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో బుధవారం ఎండీ అజంఖాన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లె ఆనంద్‌కుమార్, గ్రామానికి చెందిన శ్రీధర్ రెడ్డిలు రూ.5వేల చొప్పున్న అంత్యక్రియల కోసం ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, మల్లేశ్, లింగం యాదవ్, శ్రీశైలం, కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి



గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తలకొండపల్లి: అంతర్గత సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌లు, మురుగు కాల్వలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రాధాన్యం ప్రకారం ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టి జిల్లాలోనే మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. మండల పరిధిలోని గౌరిపల్లిలో బుధవారం సర్పంచ్ అనురాధ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పని చేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీ పరంగా తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రూ.5 లక్షల నిధులు మంజూరు చేసి గ్రామంలో మహిళా సంఘం భవనాన్ని నిర్మిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, శ్రీశైలం ఎంపీటీసీలు సరిత, రమేశ్, సీనియర్ నాయకులు రేణురెడ్డి, యాదయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, నాయకులు యాదయ్య, రాములు, లక్ష్మీదేవి, రఘురాములు, లింగంగౌడ్, డేవిడ్, చెన్నకేశవులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

కడ్తాల్: మండలంలోని కొండ్రిగాన్‌బోడ్‌తండా పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువుతండాకు చెందిన రామవత్ సురేశ్‌నాయక్‌కు చెందిన 14 మేకలను ఈనెల 11న దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు సురేశ్‌నాయక్‌ను బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కలిశారు. స్థానిక నాయకుడు బిక్కునాయక్ సమకూర్చిన రూ.10 వేలను బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, బిక్కునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, జహంగీర్‌అలీ, బీచ్యానాయక్, బుచ్చయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా!

- రాత్రి పూట తవ్వకాలు
- ఈసీ వాగు నుంచి తరలింపు
- ట్రాక్టర్‌కు రూ.3వేల వరకు విక్రయం
- పట్టించుకోని అధికారులు



నాగరగూడ ఈసీ వాగు



ట్రాక్టర్లలో నింపిన ఇసుక (ఫైల్)

షాబాద్: ఈసీ వాగు నుంచి ఇసుక, మట్టి దందా జోరుగా సాగుతుంది. ఈ విషయంలో ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. ఎంచక్క ఈ దందాను రాత్రిపూట కొనసాగిస్తున్నారు. ఇసుక, మట్టి తోడి రవాణా చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. షాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని వాగుల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. హైతాబాద్, పెద్దవేడు, నాందార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో మట్టి దందా సాగుతున్న అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాగర్‌గూడ, తిమ్మారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, చందనవెల్లి, రుద్రారం, హైతాబాద్, సోలీపేట్ తదితర గ్రామాల మీదుగా ఈసీ వాగు ప్రవహిస్తుంటుంది. ఈ వాగులో నుంచి ఇసుకను తోడి సుమారు ట్రాక్టర్ ఇసుక రూ.2వేల నుంచి రూ.3వేల వరకు విక్రయిస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు ఈ విషయంలో చూసి చూడన్నట్లుగా వారు వ్యవహరించడం బాధాకరం. దీంతో ఈ వాగుల్లో పెద్ద పెద్ద గోతులు, గుంతలు దర్శనమిస్తున్నాయి. షాబాద్ మండలంలోనే కాకుండా చుట్టు పక్కల మండలాలకు కూడా స్థానిక వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను రవాణా చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణాను కట్టడిచేసే బాధ్యతను పోలీస్‌శాఖ నుంచి రెవెన్యూశాఖకు అప్పగించారు. దీంతో ఈ శాఖ పట్టించుకున్న దాఖలాలు లేదు. వాగులు ఏడారిగా మారినా, పెద్ద పెద్ద గోతులు తయారైనా ఈ విషయాన్ని చూసి చూడనట్లుగా అధికారులు వదిలేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో నామమాత్రంగా పని చేస్తున్న బోరుబావులు సైతం ఎండిపోతున్నాయని రైతులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు వెంటనే స్పందించి ఇసుక రవాణాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

> **అక్రమ రవాణాను అరికడతాం**
>
> 
>
> ఈసీ వాగులో నుంచి అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తాం. మండలంలోని ఏ గ్రామంలోనైనా వాగుల్లో నుంచి ఇసుక తోడి రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ కోరారు. అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి అందుకు బాధ్యులయిన వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.
>
> – యాదయ్యగౌడ్, సీఐ షాబాద్

ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం..

ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు మాత్రం చూసిచూడన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కళ్ల ముందు నుంచి ఇసుక, మట్టి తరలిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఈ విషయంలో అధికారులను ప్రశ్నిస్తే లిఖిత పూర్వకంగా తమకు ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని వారు చెబుతున్నారు. తమ దృష్టికి రానప్పుడూ తాము ఎలా? చర్యలు తీసుకోవాలని బదులిస్తున్నట్లు గ్రామస్తులు వాపోయారు.

ఆధ్యాత్మికచింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఆధ్యాత్మికచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ ప్రతాపగిరి లక్ష్మీనర్సింహ్మస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఈ పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. దీంతో మనస్సు ఏకాగ్రతతో ఉంటుందన్నారు. శ్రీ ప్రతాపగిరి లక్ష్మీనర్సింహ్మ స్వామి దేవాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రతి ఏడాది ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు.

ఆ పేర్లను తొలగించండి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

మొయినాబాద్/చేవెళ్ల: గుంటూరు కారం సినిమాలో విలన్‌లకు పెట్టిన మహనీయులు పేర్లు మార్క్స్, లెనిన్‌లను వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ మేధావి, ఆర్థికవేత్త, దాస్ క్యాపిటల్ రచయిత మార్క్స్ అని చెప్పారు. శ్రామిక వర్గ విముక్తికోసం ఆయన జీవితాన్ని ధారపోసిన కామ్రేడ్ లెనిన్ పేర్లను పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మార్క్స్ పోరాడితే పోయేదేమి లేదని బానిస సంకెళ్లు తప్పా అనే నినాదంతో సమ సమాజ స్థాపనకోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అంటూ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేశారన్నారు. ఈ విషయంలో డైరెక్టర్ త్రివిక్రమ్ స్పందించి విలన్‌లకు పెట్టిన పేర్లను మార్చుకోవాలన్నారు. లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: ఇరవై ఎనిమిదేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివినవారంతా ఒకే చోట మళ్లీ కలిశారు. చదువుకునే రోజుల్లోని మధుర జ్ఞాపకాలను, తీపి గుర్తులను స్మరించుకున్నారు. మండల పరిధిలోని చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం రెడ్డిపల్లి సమీపంలోని గ్రీన్ పార్క్ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు ఒకే చోట చదివినవారంతా హాజరై నాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు జయప్రకాశ్, కృష్ణారెడ్డి, నిర్మల, జ్యోతి, కృష్ణారెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గణేష్‌గౌడ్, అంజనేయులు, రాకేష్, రఘు, శ్రీశైలం, రమేష్, సుధాకర్, సామెల్, శైలజ, ఉమారాణి, లక్ష్మి, కంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు, రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కడ్తాల మండల కేంద్రంలో కేకు కటింగ్, ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లిలో హెల్త్‌క్యాంపు, ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో మెగా హెల్త్ క్యాంపు, రక్తదానం శిబిరం, తలకొండపల్లి మండల కేంద్రంలో కేకు కటింగ్, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాజ్‌ఘాట్ వద్ద నేతల నివాళి

ఆమనగల్లు: న్యూఢిల్లీలోని మహాత్మాగాంధీజీ రాజ్‌ఘాట్‌ను బుధవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు బాపూజీకి నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు నర్సింహ, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఈదమ్మ ఉత్సవాల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్

ఆమనగల్లు: వెల్దండ మండలం చెర్కూరులో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈదమ్మ, మాందాత ఉత్సవాలలో బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు శ్రీనివాస్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్యగౌడ్, మైసయ్య, నర్సింహ, సత్యం, శ్రీనునాయక్, ప్రశాంత్, రాంచందర్‌గౌడ్, లాలయ్య, శ్రీను, సర్పంచ్ అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మన్నెగూడకు మంత్రుల రాక

తుర్కయంజాల్: మన్నెగూడలోని ప్రాంతీయ రవాణాశాఖ నూతన కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నట్లు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి రఘునందన్ గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న జాతర



ఎద్దుల బండిపై వస్తున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

కొందుర్గు: వెంకిర్యాల సంజీవపురం చింతల శ్రీ లక్ష్మివేంకటేశ్వర స్వామి జాతర కొనసాగుతుంది. బుధవారం రథోత్సవం, స్వామివారి పల్లకీ సేవ, మైసమ్మ దేవతకు బండ్లు, బోనాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నే శ్రీనివాసు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సదర్భంగా నిర్వాహకులు వారిని శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఎద్దుల బండిలో ఊరేగింపుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్యామ్‌సుందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కృష్ణారెడ్డి, యాదయ్య, రామయ్యగౌడ్, లింగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ అభినందనీయం

కేఎల్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కొనేరు లక్ష్మణ్ అవిష్



అర్యూమాన్‌కుమార్‌చౌదరిని అభినందిస్తున్న కొనేరు లక్ష్మణ్

మొయినాబాద్ రూరల్: కేఎల్ యూనివర్సిటీలో ఈసీఈ అభ్యసిస్తున్న విద్యార్థి అర్యూమాన్‌కుమార్ చౌదరి ప్రతిభ అభినందనీయమని కేఎల్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కొనేరు లక్ష్మణ్ అవిష్ అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో బుధవారం విద్యార్థి ప్రదర్శనకు కళాశాల వైస్ ప్రెసిడెంట్ కొనేరు లక్ష్మణ్ అవిష్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రామకృష్ణలు అభినందిస్తు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అభ్యసిస్తున్న అర్యూమాన్ కుమార్‌చౌదరి తన తెలివితేటలతో స్టార్టప్ ద్వారా ఆవిష్కరణ చేసిన వ్యవస్థాపకత ప్రపంచంలో సంచలనం సృష్టించారన్నారు. తన ఆలోచనతో ఏరియల్ నావిగేషన్ కోసం 'ఏఐ ఆధారిత ఫ్లైట్ కంట్రోలర్' రూపొందించడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం క్యాన్ టీఐహెచ్ఏఎన్ ఐఐటీ హైదరాబాద్‌లోని టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ ఎవల్యూయేషన్ కమిటీ గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ గౌతమ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



శంకర్‌పల్లి: క్రీడా సామగ్రిని అందిస్తున్న విద్యాధికారి అక్బర్

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు



షాబాద్: తాళ్లపల్లిలో వాలీబాల్ ఆడుతున్న ఆంజనేయులు

షాబాద్: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొల్ల ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శరీరం ధృడంగా తయారవుతుందన్నారు. కృషి పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వాటంతటవే వరిస్తాయన్నారు. ఓడిన వారు నిరాశ పడొద్దన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బాస నర్సింహులు, నాగని ఆర్‌కే, వడ్ల పురుషోత్తంచారి, శేఖర్, సురేశ్, రాజు, చందు, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్ పేర్కొన్నారు. అంకురా హోమ్స్ లిటిల్ చాంపియన్స్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సందర్భంగా మండలంలోని పాఠశాలల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాధికారి అక్బర్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన మండలంలోని మోకిల తెలంగాణ క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ క్రీడా పోటీల్లో మండలంలోని 13పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొందుర్గులో..

కొందుర్గు: యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్ శివ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్‌లో నిర్వహించిన జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఆయన హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. వెంకటేశ్వర్ రెడ్డి, ఆకారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ భవిష్యత్

మంచాల: యువత క్రమశిక్షణతో మంచి మార్గంలో నడవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. బుధవారం చెన్నారెడ్డిగూడలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడోత్సవాల్లో భాగంగా బహుమతుల ప్రదానోత్సవంలో ఏసీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. కష్టపడితే తప్ప ఏ రంగంలో ముందుకు పోలేమన్నారు. ఆట, పాటలతో పాటు ఉన్నత భవిష్యత్ కోసం పాటు పాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు యాదయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మేళ్లగూడ తండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్మెన్ కొందూటి నరేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి కట్టుగా ఉంటేనే పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయొచ్చన్నారు. అదేవిధంగా డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు మంజూరు చేసేవిధంగా ఉన్నతాధికారులతో కూడిన ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క అధికారిపై ఉందన్నారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నాస్‌లేఅవుట్ కాలనీల్లో నెల కొన్న సమస్యలను వెంటనే గుర్తించాలన్నారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాకుండా ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మేళ్లగూడలో..

మండల పరిధిలోని మేళ్లగూడ తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అదేవిధంగా నాగులపల్లిలో నిర్మించిన డ్వాక్రా మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, ఎంపీటీసీ లక్ష్మీ, ఎంపీడీఓ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.